సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

శనివారం | 25 | నవంబర్ | 2023



గంజాయి స్వాధీనం

రైలులో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని 23.860 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నారు.

- 8లో▸



అంతర్ జిల్లా బైక్ దొంగ అరెస్టు

ఏనుమాముల పీఎస్ పరిధిలో అంతర్‌జిల్లా బైక్ దొంగను అరెస్టు చేసినట్లు మామునూరు ఏసీపీ సతీష్‌బాబు తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
29⁰/22⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లా స్థాయి ఉమెన్స్ కబడ్డీ ఎంపికలు

హన్మకొండ: ఈనెల 26న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జిల్లా స్థాయి ఉమెన్స్ కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల సారంగపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారుల బరువు 75 కేజీల్లోపు ఉండాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98493 88305 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అమ్మానాన్నతో ఓటేయించండి



విద్యారణ్యపురి: తమ బంగారు భవిష్యత్ కోసం అమ్మానాన్నతో ఓటు వేయించాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై విద్యార్థులను కోరారు. శుక్రవారం సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, విద్యారణ్యపురి, ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి గోపాలపురం పక్షాన హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో విద్యార్థులకు తల్లిదండ్రులచేత తప్పనిసరిగా ఓటు వేయించాలని హామీ పత్రాలు కరపత్రాలు ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డీఈఓ అబ్దుల్‌హై మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తల్లిదండ్రుల చేత ఓటు హక్కును వినియోగించుకునేలా తల్లిదండ్రులచేత హామీ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సేవలందించేవారికే ఓటు వేయించి సామాజిక బాధ్యతల్ని నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం జీవీ రామారావు, పీఎస్ హెచ్‌ఎం ధర్మయ్య, ఆయా సంస్థల అధ్యక్షులు దామెర నర్సయ్య, కజాంపురం దామోదర్, నాగుల నర్సయ్య, యుగేంధర్, బాధ్యులు గుంటి సాంబయ్య, మల్లేశ్వర్ రావు, గోకారపు రాజేందర్, సదానందం, రాజమౌళి, ఉపాధ్యాయుడు వల్సపైడి తదితరులు పాల్గొన్నారు.

నేడు లాన్ టెన్నిస్ ఎంపికలు

హన్మకొండ: హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో శనివారం అండర్–14, 17 బాలబాలికల విభాగంలో లాన్ టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల క్రీడల సమాఖ్య జిల్లా కార్యదర్శి దస్రూనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఎంపికలకు ఆసక్తి గల క్రీడాకారులు, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 95027 48211 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల విధుల్లో పోలీసుల బాధ్యత కీలకం



హన్మకొండ అర్బన్: ఎన్నికల విధుల్లో పోలీసుల బాధ్యతలు కీలకమని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ హెచ్.ఎన్ గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్.ఎన్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలన్నారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈనెల 29, 30 తేదీల్లో పోలీసులు, సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి పలు అంశాలపై పోలీస్ అధికారులతో ఆయన చర్చించారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు రాహుల్ పంజాబ్‌రావు గావండే, పోలీస్ అబ్జర్వర్ తోగో ఖర్గా, కలెక్టర్ సిక్తా, సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీలు ఎంఏ బారీ, రవీందర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



మళ్లీ మనదే అధికారం

ములుగు, భూపాలపల్లిలో బీఆర్‌ఎస్ గెలవాలి

- ప్రజలను ఆగం చేసిన పార్టీలు మనకొద్దు.. కర్ణాటక ప్రజలు బాధపడ్తున్నరు
- సింగరేణిని ఆగం చేసింది కాంగ్రెస్సే
- ఆ పార్టీ అధికారంలోకొస్తే పైరవీలు, దళారీ వ్యవస్థ
- ములుగు, భూపాలపల్లి ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



భూపాలపల్లి సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్/ భూపాలపల్లి/ములుగు: తెలంగాణలో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. 50 ఏళ్లు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను అరిగోస పెట్టిందని, ఎన్నికల సమయంలో అబద్ధాలు, హామీలతో వస్తున్న ఆ పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ హయాంలో గిరిజన ప్రాంతాలు ఎన్‌కౌంటర్లకు నిలయాలుగా మారాయని, ఎమర్జెన్సీ, జైలు పాలు చేసే బానిస బతుకుల విముక్తి కోసం బడే నాగజ్యోతి తల్లిదండ్రులు అడవిబాట పట్టి అసువులు బాశారన్నారు. తెలంగాణ ఏర్పాటు, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు మార్గదర్శకాలతో సమస్యలను నిర్మూలించగలిగామన్నారు. ప్రజలను ఆగం చేసే కాంగ్రెస్‌లాంటి పార్టీ మనకొద్దని, కర్ణాటకలో గెలిపించినందుకు అక్కడి ప్రజలు బాధపడుతున్నరని గుర్తు చేశారు.

నాగజ్యోతి గెలిస్తే ములుగు ఓ జ్యోతిలా వెలుగుతుంది

'ములుగులో కొన్ని పనులు కావాల్సి ఉంది. ఎమ్మెల్యేగా నువ్వు ఏ పార్టీలోనైనా ఉండొచ్చు గాక. తప్పకుండా సీఎంను కలవాలి. గవర్నమెంట్‌లో ఉన్నవాళ్లను కలవాలి, మాట్లాడాలి. మీ ములుగు ఎమ్మెల్యే ఎన్నడూ రాదు. ఏం అడగదు. మాకు తోచినవి.. తెలిసినవి.. మా పార్టీవాళ్లు చెప్పిన పనులు చేసుడే తప్ప ఆమె వచ్చి ఎన్నడూ అడగదు. ఏం చేసిర్రు మీరు అంటే.. ఏం చేయలేదు? బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి ఎమ్మెల్యే అయితే ములుగు ఓ జ్యోతిలా వెలుగుతుంది' అని కేసీఆర్ అన్నారు.

ములుగు, భూపాలపల్లి అభివృద్ధి నా బాధ్యత

ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యతను తానే తీసుకుంటానన్న సీఎం కేసీఆర్.. బీఆర్‌ఎస్ అభ్యర్థులు బడే నాగజ్యోతి, గండ్ర వెంకటరమణారెడ్డిని గెలిపించాలని కోరారు. బడే నాగజ్యోతి కష్టపడి చదువుకున్నది. ఉన్నత విద్యావంతురాలిగా ఎదిగింది. సర్పంచ్‌గా పని చేసి ఇవాళ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హోదాకు వచ్చింది. నాగజ్యోతిని గెలిపించాలి' అని కోరారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి నియోజకవర్గం కోసం బాగా కష్టపడుతున్నారన్నారు. తన దగ్గరకు వచ్చిన ప్రతీసారి అభివృద్ధి పనులకు నిధులు అడిగాడే తప్ప సొంత పనులు ఎప్పుడే అడగలేదన్నారు.

సింగరేణిని ఆగం చేసింది కాంగ్రెస్సే..

'సింగరేణి సంస్థను ఆగం చేసింది కాంగ్రెస్ పార్టీనే. సంస్థ అప్పులు కట్టలేక 49 శాతం వాటాను కేంద్రానికి అప్పగించింది. డిపెండెంట్ ఉద్యోగాలు కూడా వద్దని సంతకం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని' సీఎం కేసీఆర్ అన్నారు. వర్షం కొంత ఇబ్బంది కలిగించినప్పటికీ, ప్రజలు ఇంత భారీ ఎత్తున తరలి రావడం బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి సంకేతమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పైరవీలు, దళారీ వ్యవస్థ విపరీతంగా పెరుగుతుందన్నారు. ఆయా సభల్లో మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, బీఆర్‌ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు సతీశ్‌రెడ్డి, మెట్టు శ్రీనివాస్, వీరమల్ల ప్రకాశ్, వాసుదేవ రెడ్డి, పోరిక గోవింద్‌నాయక్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటన సాగిందిలా..

- సాయంత్రం 3.42 గంటలకు : ములుగు జిల్లా కేంద్రంలోని తంగేడు స్టేడియంలో సీఎం హెలికాప్టర్ ల్యాండింగ్
- 3.50 గంటలకు : స్టేడియంలోని సభ ప్రాంగణానికి రాక
- 4.02 గంటలకు : సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభం
- 4.26 గంటలకు : ప్రసంగం ముగింపు
- 4.32 గంటలకు : హెలికాప్టర్‌లో భూపాలపల్లికి పయనం
- 4.45గంటలకు : భూపాలపల్లిలో హెలికాప్టర్ ల్యాండింగ్
- 4.55గంటలకు: సభ ప్రాంగణానికి రాక
- 5.05 – 5.12 గంటల వరకు: ప్రసంగం
- 5.15 గంటలకు : హైదరాబాద్‌కు పయనం

భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా: గండ్ర



సీఎం కేసీఆర్ సహకారంతో భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బంగారు తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ పునాదులు వేశాడన్నారు. చిన్న గ్రామ పంచాయతీగా ఉన్న భూపాలపల్లిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసిన మహనీయుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా ప్రజలు నమ్మవద్దని కోరారు.

రెండుసార్లు గెలిచిన ఎమ్మెల్యే ఏం చేసింది? : నాగజ్యోతి



'నాకు అయ్యవ్వలు లేరు. నాకంటూ కుటుంబం లేదు. నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం, నన్ను సాదుకుంటారో.. చంపుకుంటారో మీ ఇష్టం' అని ములుగు బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీతక్క నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ములుగుకు మెడికల్ కాలేజీ, మున్సిపాలిటీ, మల్లంపల్లి మండలంగా ప్రకటించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు.





ములుగులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి

తొర్రూరులో జరిగిన కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ విజయభేరి సభకు హాజరైన జనం



మీ చేతుల్లోనే తీర్పు

సేవచేసే కుటుంబానికి చేయూతనివ్వండి

- బీఆర్‌ఎస్‌తో దొరలపాలన, కాంగ్రెస్‌తో ప్రజల పాలన
- లీకేజీల కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపాలి
- మళ్లీ మా నాయనమ్మ ఇందిరమ్మ రాజ్యం తెద్దాం
- పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు ప్రియాంకగాంధీ పిలుపు



కాంగ్రెస్ పాలకుర్తి అభ్యర్థి యశస్వినిరెడ్డి, నాయకురాలు ఝాన్సీరెడ్డితో కలిసి అభివాదం చేస్తున్న ప్రియాంక గాంధీ

సాక్షి, మహబూబాబాద్/ తొర్రూరు: 'మీ చేతుల్లోనే తీర్పు ఉంది. మీరే న్యాయ నిర్ణేతలు. అమెరికాలో ఉంటూ ఇక్కడి ప్రజలకోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యశస్వినిరెడ్డి కుటుంబానికి చేయూతనిచ్చి, చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలి' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ కోరారు. కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి యశస్వినిరెడ్డి గెలుపుకోసం శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఏర్పాటు చేసిన విజయభేరి బహిరంగ సభకు ఆమె హాజరై ప్రసంగించారు. త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఫాంహౌస్‌లో ఉండి పాలించే నాయకుల సొత్తుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ బీఆర్‌ఎస్ గెలిస్తే దొరల తెలంగాణగానే ఉంటుందని, కాంగ్రెస్‌తోనే ప్రజల తెలంగాణ సాధ్యమని అన్నారు.

నోటిఫికేషన్లు వేయడం.. లీకేజీలతో సంపాదన

ఉద్యోగాలు భర్తీ చేయకుండా.. నోటిఫికేషన్లు వేయడం, పేపర్ల లీకేజీతో డబ్బులు సంపాదించాలనే నీచపు కేసీఆర్ పాలనకు చరమ గీతం పాడాలని ప్రియాంకగాంధీ పిలుపునిచ్చారు. ఒక వైపు తెలంగాణ ఉద్యమం, త్యాగాలను గుర్తుచేస్తూ మరోవైపు గడిచిన పదేళ్లలో తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన ద్రోహం వివరిస్తూ ఆమె చేసిన ఉపన్యాసం సభికులను ఉత్తేజపరిచింది. యువతను ప్రభుత్వం ఎలా మోసం చేసిందో ఆమె వివరిస్తుండగా.. యువత జేజేలు పలికారు. అదేవిధంగా తాను మహిళను అని, వారు పడే కష్టాలు తనకు తెలుసని, అందుకు మహాలక్ష్మి, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు ప్రవేశపెడుతున్నామన్నారు. మా నాయనమ్మ ఇందిరమ్మ పాలన తీసుకొస్తామని అనగా.. మహిళలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. రైతుల గురించి మేనిఫెస్టోలో పేర్కొన్న రూ.2లక్షల రుణమాఫీ, రైతుసాయం, గిట్టుబాటుధరతో పాటు ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పగానే సభలో ఉన్న రైతులంతా ఈలలు, చప్పట్లతో ప్రతిస్పందించారు. అదేవిధంగా సభలో తీన్మార్ మల్లన్న పిట్టకథలు చెబుతూ.. మాట్లాడిన తీరు అందరినీ ఆలోచింపజేసింది. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. నేను మీ సేవ కోసమే వచ్చాను. నా కోడలును అభ్యర్థిగా నిలిపాను ఆశీర్వదించండి అనగానే.. ఒక్కసారిగా సభలో కూర్చున్నవారంతా లేచి జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. రాజేందర్‌రెడ్డి కూడా వేదికపై కూర్చొని ప్రజల స్పందనను చూసి చేతులు ఎత్తి నినదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కర్ణాటక ఆరోగ్యశాఖమంత్రి దినేశ్ గుండురావు, తీన్మార్ మల్లన్న, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, నాయకులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీనారాయణనాయక్, ఎర్రబెల్లి స్వర్ణ, దొమ్మాటి సాంబయ్య, కాకిరాల హరిప్రసాద్, ప్రవీణ్‌రావు, హామ్యానాయక్, పెదగాని సోమయ్య, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వాన్ని అడ్డుకోలేరు: యశస్వినిరెడ్డి

'పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు సేవ చేయడానికి వస్తే మంత్రి దయాకర్‌రావు కుట్రలు పన్ని మా అత్తమ్మ ఝాన్సీరెడ్డి పౌరసత్వాన్ని రద్దు చేయించారు.. కానీ ఆమె వారసత్వాన్ని అడ్డుకోలేరు' అని కాంగ్రెస్ పాలకుర్తి అభ్యర్థి యశస్వినిరెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు వస్తున్న ప్రజాదరణకు భయపడిన దయాకర్‌రావు కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని, ఇక మీదట కేసులు పెడితే సహించేది లేదన్నారు. 'మీ బిడ్డగా, అక్కగా, చెల్లిగా నన్ను ఆదరించి అసెంబ్లీకి పంపిస్తే మా అత్తామామల పేరు నిలబెడతాను. మీకు మరింత సేవ చేస్తా'ను అని చెప్పారు. ఎవరు ఎన్ని డబ్బులిచ్చినా తీసుకోండి.. ఓటు మాత్రం చేతి గుర్తుకే వేయండి అని ప్రజలకు పిలుపునిచ్చారు.



తరలివచ్చిన జనం.. మురిసిన తొర్రూరు

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో తొర్రూరు పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయభేరి సభ విజయవంతం కావడంతో క్యాడర్‌లో జోష్ నెలకొంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి జనం అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో తొర్రూరు జనసంద్రమైంది.

సైడ్‌లైట్స్..

- మధ్యాహ్నం 2.55 గంటలకు హెలికాప్టర్‌లో ప్రియాంక గాంధీ తొర్రూరులో సభాప్రాంగణానికి చేరుకున్నారు.
- 3.02 గంటలకు సభా వేదికపైకి వచ్చారు.
- 3.09 గంటలకు ప్రసంగం మొదలవగా 3.51 గంటల వరకు మాట్లాడారు.
- 41 నిమిషాల పాటు ప్రసంగం సాగింది.
- 3.58 గంటలకు హెలికాప్టర్‌లో తొర్రూరు నుంచి హుస్నాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.
- హెలికాప్టర్ సభా ప్రాంగణంపై మూడు రౌండ్లు వేయడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.
- దారులు చిన్నగా ఉండడం, ప్రజలంతా ఒకేసారి తరలిరావడంతో అన్ని రహదారులు స్తంభించాయి.
- మహబూబాబాద్‌కు వెళ్లే రోడ్డులో పార్కింగ్ ఏర్పాట్లు చేయడంతో ప్రజలు కిలో మీటరు మేర నడిచి సభా ప్రాంగణానికి చేరుకున్నారు.
- ప్రియాంకగాంధీ ప్రసంగానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది.
- ప్రియాంకగాంధీ ప్రసంగిస్తున్నంత సేపు కేసీఆర్‌ను విమర్శించినా.. యశస్వినిరెడ్డిని అభినందించినా.. ఇందిరా గాంధీని గుర్తు చేసినా.. సభ హోరెత్తడంతో ప్రతిసారి ప్రసంగాన్ని ఆపిఆపి కొనసాగించాల్సి వచ్చింది.
- చప్పట్లు, ఈలలు, కేరింతలతో సభా ప్రాంగణం మార్మోగింది. కళాకారుల ఆటపాటలు ఉత్సాహం నింపాయి.
- కాంగ్రెస్ సభకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మానుకోట జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఆధ్వర్యంలో డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు, భారీగా పోలీసులను మోహరించారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

హన్మకొండ అర్బన్: ఎన్నికలను జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు అజయ్ వి.నాయక్ (ఐఏఎస్), దీపక్ మిశ్రా (ఐపీఎస్) హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులు చేపడుతున్న ఎన్నికల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అజయ్ వి.నాయక్, దీపక్ మిశ్రా మాట్లాడుతూ.. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని డీసీపీ బారీని ఆదేశించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. నగరంలో ఓటింగ్ శాతం పెంచేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏర్పాట్లపై పరిశీలకులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివేదించారు. కార్యక్రమంలో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీసీపీ రవీందర్, డీఆర్‌ఓ వై.వి గణేశ్, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.

29 వరకు ఉద్యోగులు ఓటేయొచ్చు

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- ఆరు చోట్ల ఫెసిలిటేషన్ సెంటర్లు

హన్మకొండ అర్బన్: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులకు ఈనెల 29వ తేదీ వరకు హనుమకొండ, పరకాలలో వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఆరెండు చోట్ల ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జిల్లాకు సంబంధించిన వారికి ఒక ఫెసిలిటేషన్ సెంటర్, ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులకు ఒకటి, పోలీస్ ఉద్యోగులు ఓటు వేసేందుకు మరో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరకాల తహసీల్దార్ కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అత్యవసర సర్వీసుల ఉద్యోగులకు పోస్టల్ ఓటింగ్ సెంటర్‌ను ఈనెల 24, 25, 26 తేదీల్లో హనుమకొండలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో, పరకాలలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం కూడా ఈసెంటర్లు పనిచేస్తాయని, ప్రభుత్వ ఉద్యోగులు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఈవీఎంల కమిషనింగ్ పూర్తి చేయండి: వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్: ఎలాంటి తప్పులు దొర్లకుండా ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)ల కమిషనింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల ఆర్‌ఓలు షేక్‌రిజ్వాన్‌బాషా, అశ్విని తానాజీ వాకడే సమక్షంలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను శుక్రవారం ఏనుమాముల గోడౌన్ వద్ద పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వాసుచంద్ర, ఏఆర్‌ఓ నాగేశ్వర్‌రావు ఉన్నారు.

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

కరీమాబాద్: ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగుల కోసం కలెక్టరేట్‌లో ఈనెల 26 నుంచి 28 వరకు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ కలెక్టరేట్‌లో తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు, ఆదివారం కూడా సెంటర్లు పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు.



ఏనుమాములలో ఈవీఎంల కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

ఓటింగ్ శాతం పెంచేందుకు ఉద్యోగులు కృషి చేయాలి

హన్మకొండ అర్బన్: నగరంలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలని టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని టీఎన్జీఓస్ భవన్‌లో నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రతీసారి ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతోందని, ఈసారి ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ పుల్లూరి వేణుగోపాల్, కేంద్ర సంఘం నాయకులు శనిగరపు శ్యామ్‌సుందర్, కత్తి రమేశ్, భూక్య రామునాయక్, మోయిజ్, లక్ష్మీప్రసాద్, నాయకులు రాజమౌళి, రాజేశ్‌ఖన్నా, రాంప్రసాద్, గోపీకృష్ణ, శ్రీనివాస్, రాజీవ్, భగవాన్‌రెడ్డి, గౌతమ్, పైడిరాజు, ప్రణయ్, పృథ్వీ, సుధాకర్, అజయ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకుల రాజేందర్


పొదుపరి అభ్యర్థులు

- ఖర్చు రోజుకు రూ.లక్షలోపేనట!
- వివరాలు అందజేసిన అభ్యర్థులు

హన్మకొండ అర్బన్: అనుచరులకు భోజనాలు. వారి వాహనాలకు పెట్రోల్ ఖర్చులు. జెండాలు. కరపత్రాలు. ప్రచార రథాలు. గేట్లకు అతికించే స్టిక్కర్లు. సమావేశాల నిర్వహణ ఖర్చులు. బహిరంగ సభలు.. రోజూ ఇంత ఖర్చును మన అభ్యర్థులు లక్షలోపే ముగించేస్తున్నారట. పొదుపరి అభ్యర్థులుగా పేరు తెచ్చుకుంటున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు చూపిన లెక్కలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

పొదుపుగా ఖర్చు..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో పోటీలో ఉన్న అభ్యర్థులు తమ డబ్బును చాలా పొదుపుగా వాడుతున్నారు. నామినేషన్ల రోజు నుంచి ఈనెల 23వ తేదీ వరకు ప్రధాన పార్టీల అభ్యర్థులంతా రోజుకు రూ. లక్ష వరకే ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చూపిస్తున్నారు. దీనిని ఎన్నికల అధికారులు కూడా ఆమోదించారు. మరీ ముఖ్యంగా.. అధికార పార్టీ నుంచి పోటీలో ఉన్న అభ్యర్థి మాత్రం కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల కంటే తక్కువ ఖర్చు చేసినట్లు లెక్కలు చూపించారు. ఇక స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువ మంది లక్షలోపే ఖర్చు చేసినట్లు లెక్కలు సమర్పించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం.. పోటీలో ఉన్న ప్రతీ అభ్యర్థి ప్రతీ నాలుగు రోజులకు ఒకసారి జమ ఖర్చుల వివరాలు వ్యయ పరిశీలకులకు అందజేయాలి. ఆవివరాలు, అధికారులు ప్రత్యేక బృందాల ద్వారా నమోదు చేసి పరిశీలించి ఆమోదిస్తారు. తేడా ఉన్నట్లు గుర్తిస్తే అభ్యర్థులకు నోటీసులిచ్చి వివరణ తీసుకుంటారు. కాగా.. ఎన్నికల ఖర్చులు గరిష్ఠంగా రూ.40 లక్షలు దాటొద్దని ఎన్నికల సంఘం నిబంధనల్లో పేర్కొంది. నామినేషన్ నుంచి పోలింగ్ రోజు వరకు ఖర్చులు లెక్కించనున్నారు.






చీటీ.. చింత వద్దు

ఈ ముచ్చటతెలుసా?

- పోల్ స్లిప్ లేకున్నా ఓటేయొచ్చు
- 12 కార్డుల్లో ఏదో ఒకటి చాలు..

కాజీపేట: పోల్ చీటీ(స్లిప్)లు అందలేదని ఓటర్లు చింతించాల్సిన అవసరం లేదు. పోల్ స్లిప్ లేకున్నా ఓటేయొచ్చు. ఎలా అంటే.. పోలింగ్ రోజున కేంద్రాల వద్ద బీఎల్వోలు అందుబాటులో ఉంటారు. అక్కడ వారిని కలిసి పోల్ చీటీలు తీసుకుని ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఓటరు జాబితాలో క్రమ సంఖ్య తెలుసుకుని సిబ్బందికి చెప్పి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. అలాగే, హెల్ప్‌లైన్ యాప్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని తన ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో ఓటరు తెలుసుకోవచ్చు. పోలింగ్ కేంద్రాల గోడలపై ఓటర్ల జాబితా అతికిస్తారు. పోల్ స్లిప్‌తో పాటు ఓటరు కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఎన్నికల సంఘం అనుమతించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక కార్డు చూపించాలి. అప్పుడే అధికారులు ఓటు వేసేందుకు అనుమతినిస్తారు. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి దాదాపు 70 శాతం పోల్ చీటీలు (స్లిప్) అందించినట్లు అధికారులు స్పష్టం స్తున్నారు.

ప్రచారం.. ప్రలోభం



పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ ఎత్తుకు పైఎత్తులు..

- ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు, పార్టీల తంటాలు
- కమ్యూనిటీ మీటింగ్‌లు, విందులతో ప్రసన్నం చేసుకునే యత్నం

హన్మకొండ: తెలంగాణ శాసన సభ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండడంతో విజయమే లక్ష్యంగా పార్టీలు, అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందు పడరాని పాట్లు పడుతున్నారు. ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఇందులో భాగంగా అంది వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. ఓ వైపు ప్రచారం చేస్తూనే మరో వైపు ప్రలోభాలు మొదలు పెట్టారు. నగరం, పట్టణాల్లోని వార్డులు, కాలనీలు, గ్రామాల్లో పురవీధుల్లో అభ్యర్థులు పాదయాత్ర చేస్తూ ఇంటింటికీ వెళ్లి నేరుగా ఓటర్లను కలుస్తూ పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ తమకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి తమ ప్రసంగాల ద్వారా ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ పార్టీ అగ్రనేతలను తమ నియోజకవర్గాలకు రప్పించుకుంటున్నారు. ప్రధానంగా ప్రజాకర్షణ ఉన్న నేతలను తీసుకువచ్చేందుకు పోటీ పడుతున్నారు.

నియోజకవర్గాల్లో నోట్ల వరద..

ప్రజల్లో తమ బలం చూపించుకునేందుకు అభ్యర్థులు ప్రచారం నుంచి మొదలు.. ప్రలోభాల వరకు పోటీ పడుతున్నారు. ప్రచార సమయంలో ప్రజలను పెద్ద ఎత్తున పోగు చేస్తున్నారు. అక్కడి నుంచే ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ప్రచారానికి వస్తున్న వారికి కూడా ఎంతో కొంత సొమ్ము ముట్టచెప్తుతున్నారని బహిరంగ ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా మరో వైపు కమ్యూనిటీ వారీగా సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కుల వృత్తులు, ఉద్యోగ, కార్మిక, అసోసియేషన్లు, కాలనీ కమిటీల వారీగా కమ్యూనిటీ సమావేశాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పగలు మధ్యాహ్న భోజనం, రాత్రి విందు రాజకీయాలు జోరందుకున్నాయి. కమ్యూనిటీ మీటింగ్‌లకు వచ్చిన వారికి స్థాయికి తగ్గట్టు ఒకొక్కరికి రూ.500 నుంచి రూ.5వేల వరకు ముట్టజెప్తున్నట్లు సమాచారం. కమ్యూనిటీ మీటింగ్‌ల్లో ఓటర్లను ప్రభావితం చేసే స్థాయి ఉన్న వారికి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వ్యక్తిగతంగా అందజేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నియోజకవర్గాల్లో నోట్ల వరద పారుతోంది.

ఎత్తుకు పైఎత్తులు..

పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ అభ్యర్థులు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. ప్రధాన పార్టీ అభ్యర్థులు కోవర్టులను ఏర్పాటు చేసుకుని ప్రత్యర్థి ఎత్తుగడలను తెలుసుకుంటూ వారికి దీటుగా మరో ఎత్తుగడ వేస్తూ ముందుకెళ్తున్నారు. ఎదుటి పార్టీలో ఉన్న అసంతృప్త నేతలను తమకు అనుకూలంగా మలచుకునేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే తపనతో వారు కోరుకున్న మేరకు.. చేసిన డిమాండ్ మేరకు సమర్పించుకుంటూ అభ్యర్థులు వారి మద్దతు కూడగట్టుకున్నారు.

వ్యూహాలకు పదును..

గ్రామీణ ప్రాంతాల్లో గ్రామాల వారీగా, నగరాలు, పట్టణాల్లో వార్డులు, కాలనీ వారీగా సర్వేలు చేయించి నివేదికలు తెప్పించుకుని అభ్యర్థులు వారికి బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు రచిస్తూ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. ఎన్నికల్లో గెలుపే ప్రధానంగా తమ వ్యూహాలు మారుస్తున్నారు. ఈ క్రమంలో అవసరమైతే వారికి అవసర హామీలు ఇవ్వడం.. అవసరమైన ప్రలోభాలకు గురి చేయడం ద్వారా తమ వైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే క్రమంలో పార్టీ క్యాడర్‌ను పూర్తిగా నమ్మకుండా, తమకు నమ్మకమైన వ్యక్తుల ద్వారా కార్యాన్ని కానిస్తున్నారు. ఎదుటి పార్టీలు, అభ్యర్థులపై నిఘా పెడుతూ ప్రత్యర్థి పార్టీ ఎంత ఇస్తుంది.. మనమెంత ఇవ్వాలని లెక్కలు తీస్తున్నారు.

ఉరుకులు.. పరుగులు

- కరిగిపోతున్న కాలం
- సమీపిస్తున్న ఎన్నికలు
- ఆందోళనలో అభ్యర్థులు
- గెలుపు కోసం వ్యూహప్రతివ్యూహాలకు పదును

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అభ్యర్థులు ఉరుకులు.. పరుగులతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. సమయానికి తినేది లేదు.. కునుకు తీసేది లేదు.. ఎంత సేపు ఎన్నికలపైనే ధ్యాస. ఫలితంగా ఆందోళన అంతులేనంత పెరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో తీవ్ర పోటీ నెలకొంది. దీంతో అభ్యర్థులు గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. విజయం కోసం సాగుతున్న పోరుబాటలో కాలం కొవ్వొత్తిలా కరిగిపోతోంది.




ప్రచారం.. మూడు రోజులే..

ప్రచారానికి కేవలం మూడు రోజుల సమయమే (ఈ నెల 28వ తేదీ వరకు) ఉంది. దీంతో రోజులు తరుగుతున్న కొద్ది అభ్యర్థుల్లో ఆత్రుత పెరుగుతోంది. ఓటర్లను తమ వైపు ఎలా తిప్పుకోవాలనే ఆలోచనల్లో తలమునకలవుతున్నారు. దీంతో కాలంతో పోటీ పడుతున్నారు. రోజు వారీగా ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు సాగుతున్నారు. తెల్లవారు జామున మొదలు.. అర్ధరాత్రి వరకు ఎన్నికల బిజీలోనే గడుపుతున్నారు. ఉదయం 4, 5 గంటలకే ప్రచారంలోకి జారుకుంటున్నారు. వేకువజామున, రాత్రి 11 గంటల తర్వాత ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులను, తటస్థంగా ఉన్న వారిని, ఎదుటి పార్టీలోని అసంతృప్తులను ఒంటరిగా కలుస్తూ వారి సాయం కోరుతున్నారు.

పనుల్లోకి వెళ్లకముందే ప్రచారం..

గ్రామాల్లో ప్రజలు పనులకు వెళ్లకముందు, పట్టణాల్లో ఉద్యోగాలకు, ఇతర పనులకు వెళ్లకముందే కలిసేందుకు ఉదయం 6, 7 గంటలకే ప్రచారం మొదలు ప్రారంభిస్తున్నారు. తిరిగి గ్రామాల్లో వ్యవసాయ, కూలీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చాకా, నగరాలు, పట్టణాల్లో సాయంత్రం ఉద్యోగాలు ముగించుకుని ఇళ్లకు చేరిన సమయంలో సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు ప్రచారం, కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొంటూ ఓట్లు రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ వారికి భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. గ్రామ, డివిజన్ ఇన్‌చార్జ్‌లతో 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు సమాచారం, అక్కడి పరిస్థితులు తెలుసుకుంటూ అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. వారికి కావాల్సిన సామగ్రి సమకూరుస్తున్నారు. అలసినా విశ్రాంతి లేకుండా గెలుపు కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. వ్యూహ ప్రతివ్యూహాలతో ఎన్నికల కదనరంగంలో దూసుకుపోతున్నారు.



రూ.1.98 లక్షలు పట్టివేత

బొల్లోనిపల్లి చెక్‌పోస్టు వద్ద సీజ్

నల్లబెల్లి : నల్లబెల్లి పీఎస్ పరిధిలోని బొల్లోనిపల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రూ.1.98 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై సైనాల నగేష్ తెలిపారు. దామెర మండలం ఊరుగొండకు చెందిన చెలుపూరి వైకుంఠం ఆధారం లేకుండా నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. నగదుతోపాటు వైకుంఠాన్ని డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీ ఎదుట హాజరుపరిచామని ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో చెక్‌పోస్టు ఇన్‌చార్జ్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.


నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై



REAL ESTATE

PLOT FOR SALE

■ KUDA, GWMC అప్రూవ్డ్ రెసిడెన్షియల్ ప్లాట్లు చింతగట్టు క్యాంప్ వద్ద తక్కువ ధరలో అమ్మబడును. గజం: 15,000/- మాత్రమే. సంప్ర॥ షాబుద్దీన్ - 9618892127. [W-1229315]

■ వరంగల్, ఏనుమాముల మార్కెట్ దగ్గర రెడ్డిపాలెం మెయిన్ రోడ్ ప్రక్కన పడమర ఫేస్ 182 గజాలు గల ప్లాటు నెం. 42 స్థలం అమ్మబడును. సంప్ర॥ 8919432992. [W-1200961]

HOUSE FOR SALE

■ వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-788954]

SERVICES

■ షూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital. PH: 9041114468 [W-788952]

VEHICLE FOR SALE

■ M/s. Indusind Bank Ltd. Vehicles for sale Through closed cover Quotations Accepted TS25F8011 - SWIFT ZXI-2022. Cell: 9985323479, 9959343539. [W-1229317]

CHANGE OF NAME

■ I, CH. KAVITHA (Old Name), R/o. H.No.11-25-1183, Kothawada, Warangal Dist, Telangana, India has changed my name as MADIRAGANI SRIKAVITHA(New Name) for all purposes. [W-788957]

మండి హౌస్ ఫర్ సేల్

■ హన్మకొండలో మండి హౌస్ ఫర్ సేల్. సంప్రదించండి: సెల్: 8801854936, 6309793722. [W-1229316]

WANTED

■ యువరాజ్ కిరాణంలో పని చేయుటకు కిరాణంలో 3 సం॥ చేసిన అనుభవం గల యువతీ, యువకుడు కా॥, ఆకర్షణీయమైన జీతం. వరంగల్ లోకల్ వారికి మాత్రమే. సంప్ర: అండర్ బ్రిడ్జి దగ్గర, వరంగల్. 9490133696. [W-1200960]

■ Wanted (Female Candidate) Overseas Counsellor / System Admin. Qlf: Any Degree, PGDCA, System Proficiency. Good Salary. Ph: 8019752576. [W-788956]

■ కాంట్రాక్టర్ వద్ద పెట్రోల్ పంపు కన్స్ట్రక్షన్ & రైల్వే కన్స్ట్రక్షన్ నందు పనిచేయుటకు అనుభవం గల ఇంజనీర్స్ మరియు సూపర్‌వైజర్స్ కావలెను. వర్క్ ప్లేస్, తెలంగాణ సంప్ర॥ 9989606333, 9491474143. [W-1200962]

■ Govt (Regd) సంస్థ తరుపున Work చేయుటకు సొంత కంప్యూటర్ గలవారు కావలెను. ఇంటి దగ్గరే వర్క్ చేస్తూ 9 to 19K వరకు సంపాదించే అవకాశం. సెల్: 8977429273. [W-1229312]

■ మా సంస్థకు P/F టైం వర్క్ కొరకు 10th/ ఇంటర్ / డిగ్రీ అభ్యర్థులు 50 మంది కావలెను. P/F-10K, F/T:22K వర్క్ ఫ్రం హోమ్. Priyanka ✆ 84639 30673 [B-491]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1221873]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 9177736926 [G-824725]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భార్యను చంపిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష



వరంగల్ లీగల్: అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించి చివరకు ఆమెను హత్య చేసిన కేసులో నల్లబెల్లి మండలం ధర్మారావుపల్లెకు చెందిన అందెస్వామికి యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ శుక్రవారం వరంగల్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి కె.రాధాదేవి తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ములుగు వెంకటాపురం గ్రామానికి చెందిన పిట్టల లతను నల్లబెల్లి మండలం ధర్మారావుపల్లెకు చెందిన అందెస్వామికి ఇచ్చి 2010, జూన్2న వివాహం చేశారు. వివాహ సందర్భంగా రూ.5 లక్షల నగదు ఇతర సామగ్రి కట్న కానుకలుగా ఇచ్చారు. వివాహానంతరం స్వామి డ్రైవింగ్ చేస్తూ బొల్లికుంట సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు వచ్చిన సందర్భంలో తరుచూ భార్యను కొట్టి అత్తవారింటి నుంచి డబ్బులు తీసుకురమ్మనే వాడు. ఈ క్రమంలో పలుమార్లు లత తల్లిదండ్రులు, అన్నదమ్ములు స్వామికి వేలాది రూపాయలు ఇచ్చారు. అనేకమార్లు పంచాయితీలు జరగగా మరోసారి తన భార్యను కొట్టనని పెద్దల సమక్షంలో ఒప్పుకొని, తిరిగి అదే మార్గంలో ఉండేవాడు. ఈ క్రమంలో అత్తవారింటి వద్ద పంచాయతీ జరిగిన తర్వాత భార్యను తీసుకెళ్తానని చెప్పిన స్వామి.. లాయర్ ద్వారా భార్యకు నోటీసు పంపించాడు. దీంతో లత వరంగల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించగా స్వామి తన భార్య లతను స్వగ్రామం తీసుకెళ్లాడు. రెండు రోజుల తర్వాత 2015, సెప్టెంబర్ 9న తన చీరలు ఎందుకు కాల్చావని అడగగా కోపోద్రిక్తుడైన స్వామి.. లతపై కిరోసిన్ పోసి నిప్పటించాడు. మంటలు ఎగిసి పడడంతో కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి లతను 108లో ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ 2015, సెప్టెంబర్ 14న లత మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నల్లబెల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నేరస్తుడు అందెస్వామికి యావజ్జీవ కారాగార శిక్ష రూ.22 వేల జరిమానా విధిస్తూ జడ్జి రాధాదేవి తీర్పు ఇచ్చారు. కేసును అప్పటి పోలీస్ అధికారి మురళీధర్ పరిశోధించగా, సాక్షులను కానిస్టేబుల్ మహేష్, హోంగార్డు రమేష్ కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పీపీ సత్యనారాయణగౌడ్, భద్రాద్రి వాదించారు.

మరో ఘటనలో ఆటో డ్రైవర్‌కు 8 ఏళ్ల జైలు..

వరంగల్ లీగల్: భార్యను హత్య చేసిన కాజీపేట రైల్వేక్వార్టర్స్‌కు చెందిన ఆటోడ్రైవర్ మేకల శ్రీనివాస్‌కు ఎనిమిది సంవత్సరాల కఠిన జైలుశిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణగౌడ్ కథనం ప్రకారం కాజీపేటకు చెందిన ఆటో డ్రైవర్ మేకల శ్రీనివాస్‌కు ధర్మసాగర్ మండలం మల్లక్‌పేటకు చెందిన నారబోయిన రమను ఇచ్చి 2010 మార్చిలో వివాహం చేశారు. శ్రీనివాస్ తండ్రి మృతి చెందడంతో తల్లి రైల్వేలో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. శ్రీనివాస్ మద్యానికి బానిసై తరుచూ తన భార్య రమను చితకబాదేవాడు. ఈ క్రమంలో 2021, మార్చి 24న మద్యం మానేయాలని రమ.. భర్తను కోరింది. దీంతో కోపోద్రిక్తుడైన శ్రీనివాస్ కత్తితో రమను పొడిచాడు. అప్పుడే ట్యూషన్ నుంచి వచ్చిన వారి చిన్న కుమారుడు రక్తం చూసి భయంతో కేకలు వేయగా స్థానికులు వచ్చారు. దీంతో వారిని చూసి శ్రీనివాస్ పరారయ్యాడు. అప్పటికే రమ మృతి చెందింది. శ్రీనివాస్ రైలులో పారిపోవడానికి యత్నించగా పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువు కావడంతో శ్రీనివాస్‌కు 8 సంవత్సరాల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. పోలీస్ అధికారులు నరేందర్, రాజు కేసు పరిశోధించగా, సాక్షులను సుధాకర్, ఇమాన్ కోర్టులో ప్రవేశపెట్టారు.

కిరాణానికి వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- బైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ స్కూల్ బస్సు
- అక్కడికక్కడే చిన్నారి మృతి, తండ్రి పరిస్థితి విషమం
- నార్లాపూర్‌లో ఘటన


కూతురు జస్మికతో తండ్రి రమేష్(ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి: ఓ ద్విచక్ర వాహనాన్ని స్కూల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారి మృతి చెందగా, తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని నార్లాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన కాత రమేష్.. తన కూతురు జస్మిక (21 నెలలు)ను తీసుకుని బైక్ పై కిరాణా షాపుకు వెళ్లి సరుకులు కొనుగోలు చేశాడు. తిరిగి తన బిర్యానీ పాయింట్‌కు వెళ్తున్న క్రమంలో గోవిందరావుపేట మండలం పస్రాకు చెందిన సెయింట్ మేరీ ప్రైవేట్ స్కూల్ బస్సు నార్లాపూర్ సెంటర్‌లో బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్ పై కూర్చున్న జస్మిక అక్కడికక్కడే మృతి చెందగా రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్పందించిన స్థానికులు రమేష్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రమేష్ ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, జస్మిక మృతి చెందడంతో పాటు రమేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లి మౌనిక రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా వెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు.

23 కిలోల గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో నిందితుడు

రఘునాథపల్లి: రైలులో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని 23.860 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నారు. జార్ఖండ్ రాష్ట్రం థానేలోని కైలాస్ అపార్ట్‌మెంట్‌లో నివసించే మనోజ్ శ్యామ్‌దేవ్‌షా శుక్రవారం సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే భాగ్యనగర్ రైలులో రూ 5.96 లక్షల విలువైన గంజాయి తీసుకెళ్తూ మార్గమధ్యలో రఘునాథపల్లి రైల్వే స్టేషన్‌లో దిగాడు. దీనిపై సమాచారం అందుకున్న ఆర్‌పీఎఫ్, వరంగల్ టాస్క్‌ఫోర్స్, రఘునాథపల్లి పోలీసులు మనోజ్ శ్యామ్‌దేవ్‌షా అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై, స్పెషల్ స్క్వాడ్ సభ్యులు, ఎంపీడీఓ హసీం, సిబ్బంది ఉన్నారు. కాగా, మనోజ్ శ్యామ్‌దేవ్‌షా గంజాయిని ముంబై తరలిస్తున్న క్రమంలో పోలీసులకు పట్టుబడ్డాడు.


గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ద్విచక్రవాహనం కొనివ్వలేదని..

- విద్యార్థి ఆత్మహత్య
- రామవరంలో ఘటన


రాజు (ఫైల్)

వర్ధన్నపేట: బైక్ కొనివ్వలేదనే కారణంతో ఓ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని రామవరంలో జరిగింది. గ్రామానికి చెందిన ఉడుత కుమారస్వామి కుమారుడు రాజు (22) వరంగల్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఈ క్రమంలో తనకు బైక్ కొని ఇవ్వాలని తండ్రితో శుక్రవారం ఉదయం వాదనకు దిగాడు. దీనికి తండ్రి కుమారస్వామి.. రాజును మందలిస్తూ ముందు డిగ్రీ పూర్తి చేసి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నాడు. అనంతరం మేత నిమిత్తం గొర్రెలను తోలుకుని సమీప అడవిలోకి వెళ్లాడు. దీంతో రాజు ఆగ్రహంతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అనంతరం తన స్నేహితుడు మోహన్‌కు ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగానని తెలిపాడు. దీంతో స్నేహితుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు హుటాహుటిన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి రాజును వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

డ్రెయినేజీ గుంతలో పడి వ్యక్తి మృతి

ములుగు రూరల్: డ్రెయినేజీ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లిలో చోటు చేసుకుంది. వరంగల్‌కు చెందిన నాగుల రమణ(55) మహ్మద్‌గౌస్‌పల్లి బంధువుల ఇంటి వచ్చాడు. రాత్రి సమయంలో కాలకృత్యాల కోసం బయటకు వచ్చి డ్రెయినేజీలో పడి గాయాలపాలైయ్యాడు. దీనిని ఎవరూ గమనించలేదు. ఉదయం రమణ కోసం బంధువులు వెతుకుతున్న క్రమంలో డ్రెయినేజీలో మృతదేహం కనిపించింది. దీంతో బంధువులు బోరను విలపించారు. కాగా, రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నిర్మించిన డ్రెయినేజీపై కప్పు వేయకపోవడంతో ఈ ఘటన జరిగిందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ఒకరు మృతి చెందారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అంతర్ జిల్లా బైక్‌ల దొంగ అరెస్టు

- 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మామునూరు ఏసీపీ సతీష్‌బాబు

వరంగల్: ఏనుమాముల పీఎస్ పరిధిలోని ఏనుమాముల బాలాజీ జంక్షన్ వద్ద అంతర్‌జిల్లా బైక్‌ల దొంగను అరెస్టు చేసినట్లు మామునూరు ఏసీపీ సతీష్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఏనుమాముల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం బొడ్డువానిపల్లి, నారాయణపూర్ గ్రామానికి చెందిన కంప విజయ్ తన చిన్నప్పుడే తల్లి చనిపోవడంతో అమ్మమ్మ దగ్గర ఉండి చదువుకున్నాడు. వ్యసనాలకు బానిసైన విజయ్.. చదువు మధ్యలోనే ఆపి వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో పాత నేరస్తులతో స్నేహం చేసుకుంటూ చిన్నప్పటి నుంచే చోరీలకు పాల్పడేవాడు. దీంతో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీ కేసులు నమోదై జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడు. అయినా తన ప్రవర్తన మార్చుకోకుండా ఎప్పటి లాగానే కొంత కాలంగా పలు ప్రదేశాలలో చోరీలకు పాల్పడుతున్నాడు. ప్రస్తుతం విజయ్‌పై ఏనుమాముల, హనుమకొండ, మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మహబూబాద్ టౌన్, డోర్నకల్, మెట్‌పల్లి, జగిత్యాల జిల్లాలో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం బాలాజీ జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో విజయ్‌ను అరెస్టు చేసి సుమారు రూ.7.05లక్షల విలువైన 25 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. కాగా, విశ్వసనీయ సమాచారం సేకరించి నేరస్తుడిని పట్టుకున్న ఏనుమాముల సీఐ ఏ.మహేందర్, ఎస్సై పోగుల శ్రీకాంత్, ఏఎస్సై ఉప్పలయ్య, సిబ్బందికి రివార్డులు అందించి ఏసీపీ సతీష్‌బాబు అభినందించారు.


అంతర్‌జిల్లా దొంగ నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను చూపుతున్న పోలీసులు